క్లుప్తంగా

తాగునీటి సరఫరాకు నేటి నుంచి అంతరాయం

సామర్లకోట: మున్సిపాలిటీ కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు మంగళవారం నుంచి అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు జరుగుతున్నాయని చెప్పారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వాడాలని సూచించారు.

ముందస్తు సమాచారం లేకుండానా?

తాగునీరు నిలుపుదల చేసే సమయంలో రెండు రోజులు ముందుగా సమాచారం ఇవ్వాల్సి ఉండగా, అప్పటి కప్పుడు తాగునీరు నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించడం సరికాదని జిల్లా పౌర సంక్షేమ సంఘ కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు అన్నారు. మంగళవారం నుంచి తాగునీరు నిలుపుదల చేస్తున్నట్లు సోమవారం సాయంత్రం ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ప్రజలు తాగునీటిని నిల్వ చేసుకోవడానికి సమయం లేకుండా ఇలా చేయడం సరికాదన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని కోరారు.

ఉత్సాహంగా భజన పోటీలు



పోటీల్లో పాల్గొన్న వేలంక శ్రీవిజయదుర్గ భజన మండలి

సామర్లకోట: వేట్లపాలెం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జిల్లా స్థాయి భజన పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆలయంలో ఈ నెల ఏడు నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభం కాగా, భీష్మ ఏకాదశి రోజు శనివారం స్వామివారి కల్యాణం జరిగిన విషయం విదితమే. దీనిలో భాగంగా ఆదివారం జిల్లా స్థాయి భజన పోటీలను ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ప్రారంభించారు. సోమవారం మండపేట, జి.మేడపాడు, వేలంక, వడిశలేరు, జి.దొంతమూరు, వేట్లపాలేనికి చెందిన భజన బృందాలు పాల్గొన్నాయి. కల్యాణ ఉత్సవాల ముగింపు సందర్భంగా విజేతలైన స్త్రీ, పురుష బృందాలకు వేర్వేరుగా బహుమతులు అందజేస్తారు. సోమవారం సదస్యం జరిగింది. అలాగే 12వ తేదీన ఉదయం చక్రస్నానం, పూర్ణాహుతి, రాత్రి శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

పైపులైన్ మరమ్మతులు ప్రారంభం



పైపులైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న డీఈ తదితరులు

సామర్లకోట: పట్టణంలోని ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్ నుంచి పైపులైన్ల ద్వారా గణపతినగరం, కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న వాటర్ ట్యాంకులకు తాగునీరు అందిస్తున్నారు. నిర్ణీత సమయంలో ట్యాంకులు నిండకపోవడంతో పైపులైన్‌కు లీకేజీలు ఉన్నట్టు మున్సిపల్ డీఈ కె.శశిధర్ గుర్తించారు. దాంతో సోమవారం పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టారు. డీఈతో పాటు, ఏఈ రమేష్, ఫిల్టర్ బెడ్ ఇన్‌చార్జిలు సాగర్, గిడుతూరి శ్రీనివాసు తదితరులు పర్యవేక్షించారు.

'శాంతివర్ధన' సేవలు అభినందనీయం



శాంతివర్ధనలో మెటీరియల్ అందజేస్తున్న సీఫుడ్స్ సిబ్బంది

పెద్దాపురం: మండలంలోని పులిమేరు శాంతివర్ధన సేవలు అభినందనీయమని దేవి సీఫుడ్స్ అధికార బృందం పేర్కొంది. సీఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ బ్రహ్మానందం జన్మదినం సందర్భంగా సోమవారం విద్యార్థులకు అవసరమైన ఫిజియోథెరపీ కిట్లు, దుప్పట్లు, చాపలు, స్కూల్ యూనిఫారాలను పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, ప్రిన్సిపాల్ సత్య దంపతులకు అందజేశారు. పాఠశాల విద్యార్థులకు అందుతున్న సేవలపై బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో ఏఓ వేణు, ఫిజియోథెరపిస్ట్ భార్గవి, బాబి, అప్పలరాజు, శివ, దుర్గాప్రసాద్, విశాల, రాజేంద్ర పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక భవిత కేంద్రంతో రూ.25 వేల విలువైన టీఎల్‌ఎం బోధన సామగ్రిని భవిత కేంద్రం ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ చౌదరి మాట్లాడుతూ, సీఫుడ్స్ యాజమాన్యం సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శివజ్యోతి, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ

- నేడు కుంతీమాధవస్వామి రథోత్సవం
- ఘనంగా కొనసాగుతున్న కల్యాణోత్సవాలు
- నిత్యం అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు

పిఠాపురం: ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పిఠాపురంలో వేంచేసి ఉన్న పంచమాధవ క్షేత్రాలలో ఒకటైన కుంతీమాధవ స్వామి దివ్య రథోత్సవం మంగళవారం రాత్రి నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పిఠాపురం మహారాజా రాజారావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహదూర్ పేరున తొలి అర్చన అనంతరం రథయాత్ర ప్రారంభించనున్నారు. రాత్రి తొమ్మిది గంటలకు అశేష భక్తజనం వెంటరాగా, రథయాత్ర కొనసాగనుంది. స్వామివారి ఆలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌కు రథోత్సవం చేరుకుంటుంది. దీనికోసం పిఠాపురం మహారాజా వారు తయారు చేయించినట్లుగా చెబుతున్న స్వామివారి రథం ఇప్పటికే సిద్ధం చేస్తున్నారు. కుంతీమాధవస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. రథోత్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ ఎన్ శ్రీరాములు తెలిపారు. రథయాత్ర సందర్భంగా ఆలయం వద్ద తీర్థం నిర్వహించనున్నారు. గత ఐదు రోజుల నుంచి విశేషాలంకారాల్లో స్వామివారు భక్తులకు దర్శనమిస్తున్నారు. కల్యాణం సందర్భంగా విశేష ఆభరణాల అలంకారంలో స్వామి కొలువై ఉన్నారు. మంగళవారం రథోత్సవం అనంతరం బుధవారం తెల్లవారుజామున స్వామివారు రథంపై ఉప్పాడ తీరానికి చేరుకోనున్నారు. ఉప్పాడ సముద్ర తీరంలో స్వామివారి చక్ర తీర్థం అనంతరం భక్తులు మాఘ పౌర్ణమి పుణ్య స్నానాలు ఆచరించనున్నారు. రాత్రి రథోత్సవం పూర్తయిన తరువాత చీకటిలో ఉప్పాడ సాగర తీరానికి చక్రతీర్థ నిర్వహణకు స్వామి వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. చీకటిలో స్వామివారు ఊరేగింపుగా వెళ్లడం వల్ల ఈ దేవుడికి దొంగ దేవుడు అనే పేరు ఉంది.



పిఠాపురంలో కల్యాణోత్సవాల్లో పొన్న వాహనంపై కుంతీమాధవ స్వామి గ్రామోత్సవం



రథోత్సవానికి సిద్ధమైన కుంతీమాధవ స్వామివారి ఉత్సవమూర్తులు



విశేష ఆభరణాల అలంకరణలో కుంతీ మాధవస్వామి

పొన్న వాహనంపై గ్రామోత్సవం

కుంతీమాధవ స్వామి కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. నిత్యం ఉదయం పంచామృతాభిషేకాలు, సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు స్వామివారు ఒక్కో వాహనంపై విహరిస్తూ, భక్తులకు దర్శనమిస్తున్నారు. సోమవారం పొన్న వాహనంపై గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించగా, పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట

సామర్లకోట: పవిత్రమైన పంచారామ క్షేత్రంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. స్వామివారి ప్రీతైన రోజు కావడంతో తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారికి నీటితో అభిషేకాలు, పిఠాపురం మహారాజా గోత్రనామాలతో పూజలు చేశారు. అమ్మవారి కుంకుమార్చనలు నిర్వహించారు. తొలి అభిషేకాన్ని తిలకించడానికి భక్తులు బారులు తీరారు. స్వామివారికి అభిషేకాలు చేసేందుకు వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి ఆలయ పుష్కరణి నీటితో అభిషేకాలు చేశారు. భక్తులు ఆలయంలోని ఉప ఆలయాలు, మూలవిరాట్‌తో పాటు, స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉదయం పులిహోర ప్రసాదంగాను, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని భక్తులకు ఏర్పాటు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, సన్నిధిరాజు వెంకటరమణ, భాస్కర్, చెరుకూరి రాంబాబు, కొంతేటి భీమన్న పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు



ఐఓసీ మార్కెటింగ్ డైరెక్టర్ దంపతులకు స్వామివారి ఫొటో ఇస్తున్న ఈఓ

అలాగే పంచారామ క్షేత్రంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మార్కెటింగ్ డైరెక్టర్ వి.సతీష్‌కుమార్ దంపతులు సోమవారం పూజలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కాలభైరవస్వామి, ధ్వజ స్తంభం, పెద్ద నంది, ఉప ఆలయాలు, మూల విరాట్, స్వామివారిని, అమ్మవారిని వారు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి ఫొటో, ప్రసాదాన్ని ఈఓ అందజేశారు. తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, వీఆర్వోలు ఉన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ధర్నా



సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

సామర్లకోట: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. అర్హులైన నిరు పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, గతంలో పట్టాలు పొందిన వారికి స్థలాలు చూపించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల వారికి మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు, ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షల రుణం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.1,500, తల్లికి వందనం, ఉచిత బస్సు, రైతు భరోసా వంటి హామీలను అమలు చేయాలని ఆందోళనకారులు నినాదాలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆయా హామీలను అమలు చేయకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ పద్మాజారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బొండకొండ, పట్టణ నాయకులు మడగల రమణ, నమ్మి సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానసిక, దివ్యాంగ చిన్నారుల కోసం సర్వే



సామర్లకోటలో సర్వే చేస్తున్న లీగల్ సర్వీస్ సభ్యులు

సామర్లకోట: కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్‌సెల్ అథారిటీ చైర్మన్ల ఆదేశాల మేరకు సోమవారం నుంచి పట్టణంలో మానసిక, దివ్యాంగ చిన్నారులను గుర్తించడానికి సర్వే చేపట్టినట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.మంగ తెలిపారు. గణపతినగరంలో 68 ఇళ్లలో సర్వే చేయగా, ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు 19 మంది దివ్యాంగులను గుర్తించినట్టు చెప్పారు. వీరిలో ఇద్దరు మానసిక వైకల్యం కలిగిన వారున్నారన్నారు. వీరి అవసరాలను నమోదు చేసుకున్నట్టు చెప్పారు. అదేవిధంగా బాల్య వివాహాల కారణంగా నష్టపోయిన వారిని గుర్తించి ధైర్యం చెప్పామన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు జి.సునీల్‌కాంత్, పితాని శ్రీదేవి, కె.దమయంతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఎస్ శ్రీనివాసరావు, ఎస్ అనిత, అంగన్‌వాడీ వర్కర్ల ప్రతినిధులు ఎస్తేరురాణి, నాగమణి, ఆశా వర్కర్లు విజయలక్ష్మీ, లిల్లీగ్రేస్, ఏఎన్ఎం మంగాదేవి పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీతో తాగునీరు కలుషితం



వాకతిప్పలో కాపుల రామాలయం వద్ద డ్రైనేజీలో పైపులైన్ లీకేజీ

కొత్తపల్లి: స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామంటూ చెబుతున్న అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. డ్రైనేజీలో ప్రధాన పైపులైన్ మరమ్మతులకు గురై, తాగునీరు కలుషితం కావడమే ఇందుకు నిదర్శనం. వాకతిప్ప శివారున ఉన్న నాగులాపల్లి ఏరియా పరిసర ప్రాంతాల రక్షిత తాగునీటి పథకం నుంచి ఉప్పాడ వైపు వెళుతున్న ప్రధాన పైపులైన్ కాపుల రామాలయం వద్ద మరమ్మతులకు గురైంది. డ్రైన్‌లో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు కలుషితమవుతోంది. ఆరు నెలలుగా ఈ పైపులైన్ మరమ్మతులకు గురైందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఇదే పైపులైన్‌కు గత కొంతకాలంగా కో-ఆపరేటివ్ బ్యాంకు సమీపంలో మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వర్ మొరాయించడంతో రోగులకు ఇక్కట్లు



సామర్లకోట సీహెచ్‌సీ వద్ద బారులు తీరిన రోగులు

సామర్లకోట: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద రోగుల ఇక్కట్లు తప్పడం లేదు. సోమవారం సర్వర్లు మొరాయించడంతో వైద్యం కోసం వచ్చిన వారికి ఓపీ నమోదు చేయించుకునే అవకాశం లేక ఇబ్బందులకు గురయ్యారు. గర్భిణులు, వృద్ధులు ఓపీ కౌంటర్ వద్ద గంటల తరబడి బారులు తీయవలసి వచ్చింది. గతంలో ఆస్పత్రి వచ్చిన రోగి ఓపీ చీటీ రాయించుకుని, డాక్టర్ల వద్దకు వెళ్లేవారు. ప్రస్తుతం రోగి పేరు ఆన్‌లైన్‌లో నమోదు కానిదే వైద్యం అందని పరిస్థితి ఏర్పడింది. దాంతో ఆస్పత్రికి వచ్చే వారు తప్పనిసరిగా సెల్‌ఫోన్ తేవాల్సి వస్తోంది. ఆన్‌లైన్‌లో నమోదుకు ఆధార్ నంబరు సరిపోయేది. ప్రస్తుతం తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్ కార్డు ఉండాలనే నిబంధనతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆన్‌లైన్‌లో పేరు నమోదుకు సర్వర్లు మొరాయించడంతో రోగులు అవస్థలు పడ్డారు. మూడు గంటల పాటు నిలబడినా ఓపీ చీటీ రాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. పాత పద్ధతిలో మాన్యువల్‌గా ఓపీ చీటీ ఇచ్చి వైద్యం అందించాలని కౌన్సిలర్లు నేతల హరిబాబు, రెడ్డి లోవకుమారి డిమాండ్ చేశారు.

సాగుదారులకు పట్టాలు ఇవ్వాలి

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న లిబరేషన్ నాయకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి సర్వే నంబర్-1లో ఉన్న భూముల్లో 40 ఏళ్లుగా సాగు చేస్తున్న ఎస్సీ, బీసీ పేదలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చెందుర్తి గ్రామ సచివాలయం వద్ద సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గొడుగు సత్యనారాయణ మాట్లాడుతూ, పిఠాపురం నియోజకవర్గం చెందుర్తి గ్రామ సర్వే నంబర్-1లో ఉన్న 456 ఎకరాల ప్రభుత్వ భూములలో 40 ఏళ్లుగా చెందుర్తి, కొడవలి, కొత్త వక్రకూటం గ్రామాలకు చెందిన ఎస్సీ, బీసీ కులాల పేదలు సాగు చేసుకుంటున్నారన్నారు. సాగుదారులైన పేదలకు పట్టాలు మంజూరు చేయాలని అధికారులకు అనేకసార్లు విన్నవించామన్నారు. అప్పటి జేసీ గోపాలకృష్ణ ద్వివేది నెల రోజుల పాటు 15 మంది బృందంతో సర్వే చేయించి, సాగుదారులను గుర్తించారన్నారు. ఇప్పటివరకు అధికారులకు పట్టాల కోసం ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, ఫలితం లేదన్నారు. ఈ భూములను బడా కంపెనీలకు అప్పజెప్పడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై సాగుదారులు హైకోర్టును ఆశ్రయించగా, వారికి అనుకూలంగా స్టే ఇచ్చిందన్నారు. ఇది ఇంకా కొనసాగుతుందని, అయినా కొంతమంది భూములు స్వాహా చేయడానికి పై స్థాయిలో పావులు కదుపుతున్నారని తెలిపారు. ఆ ప్రయత్నాన్ని విరమించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సచివాలయ వీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లిబరేషన్ వివిధ సంఘాల నాయకులు కాకర రత్నకుమారి, మానుకొండ లచ్చబాబు, జి.నాగమణి, నక్కా మంగమ్మ, సాగుదారులు పాల్గొన్నారు.

బోద రహిత సమాజానికి కృషి చేద్దాం

అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సరిత



పెద్దాపురంలో మాత్రలు వేస్తున్న డాక్టర్ అనూష



సామర్లకోట కొత్తూరు మున్సిపల్ స్కూల్‌లో విద్యార్థికి మాత్రలు వేస్తున్న డాక్టర్, మున్సిపల్ కమిషనర్

పెద్దాపురం: ప్రతి ఒక్కరూ బోద రహిత సమాజానికి కృషి చేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ పి.సరిత అన్నారు. జాతీయ బోదవ్యాధి, నులి పురుగుల నివారణ దినం సందర్భంగా సోమవారం స్థానిక పాత ఆస్పత్రి, బస్టాండ్, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో డీఈసీ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ సరిత మాట్లాడుతూ, బోద వ్యాధి నివారణకు ఏటా డీఈసీ మాత్రల పంపిణీ చేపడుతున్నట్టు చెప్పారు. పరిసరాల పరిశుభ్రత ద్వారా బోద వ్యాధి నివారణ సాధ్యమవుతుందన్నారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, దోమపోటు వల్ల వచ్చే బోద వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి డీఈసీ మాత్రలను మింగించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

విద్యాసంస్థల్లో డీ వార్మింగ్ డే

సామర్లకోట: జాతీయ నులి పురుగుల నివారణ దినాన్ని సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విజయవంతంగా నిర్వహించినట్టు ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాల మేరకు ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నులి పురుగులతో పిల్లలు, గర్భిణులకు కలిగే ఆరోగ్య సమస్యలను డాక్టర్లు, హెల్త్ సిబ్బంది వివరించారు. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు వారందరికీ ఆల్బెండజోల్-400 మి.గ్రా. మాత్రలను తప్పనిసరిగా వేయాలన్నారు. కొత్తూరు మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలతో పాటు, హైస్కూళ్లలోను విద్యార్థులకు మాత్రలు వేశారు. పాఠశాలలకు హాజరు కాని పిల్లలకు 17వ తేదీన మరోసారి ఈ కార్యక్రమం చేపడతామని ఎంఈఓలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, వేట్లపాలెం పీహెచ్‌సీ డాక్టర్లు పి.రమాశ్రీదుర్గ, కేవీపీ రమ్యప్రభ, మున్సిపల్ ఏఎస్ఓ పెంకే శ్రీనివాసు, హెచ్ఎంలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అలుకుల సంబరం

కరప: గొర్రిపూడి గ్రామంలో సోమవారం అలుకుల సంబరం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కరికాల భక్తులు ఈ సంబరాన్ని ఐదు దశాబ్దాలుగా చేస్తున్నారు. ఏటా మాఘ మాసంలో వచ్చే భీష్మ ఏకాదశి రోజున బసవేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తారు. తరువాత ఐదు రోజుల పాటు వివిధ రకాల పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఇందులో భాగంగా మూడో రోజు కొంతమంది కరికాల భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు గోదావరి పాయ ప్రవహించే కేఎంజీ కాలువలో స్నానమాచరించారు. బసవేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి, శూలాలను బుగ్గలకు గుచ్చుకుని, ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగారు. బుధవారం రాత్రి ఆలయంలో పార్వతీ, పరమేశ్వరుల సంబరాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అదే రోజు సాయంత్రం భక్తులు నిప్పుల గుండం తొక్కడం పరిపాటి. నందిని ఎత్తుకుని నిప్పుల గుండం తొక్కితే సంతానం కలుగుతుందని గ్రామస్తుల విశ్వాసం. గొర్రిపూడి, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త చప్పిడి నవీన్, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యలపై గళమెత్తే వారినే ఎన్నుకోవాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న క్రాంతికుమార్ తదితరులు

పెద్దాపురం: ప్రజా సమస్యలపై గళమెత్తే నాయకుడినే రానున్న పట్టభద్రుల శాసన మండలి సభ్యులుగా ఎన్నుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ కోరారు. పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులుకు మద్దతుగా సోమవారం పట్టణంలో సీఐటీయూ నాయకులు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ కరపత్రాన్ని విడుదల చేశారు. రాష్ట్రంలో నిజాయితీగా కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్నది పీడీఎఫ్ అభ్యర్థులే అన్నారు. ఉద్యోగుల పీఆర్‌సీ, ఐఆర్, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్లకు కనీస వేతనాలు, మెగా డీఎస్సీ, రైతులకు గిట్టుబాటు ధర కోసం నిర్వహించిన పోరాటాలకు మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. శాసన మండలికి సమర్థులను పంపడానికి పట్టభద్రులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, నాయకులు సిరిపురపు శ్రీనివాస్, నీలపాల సూరిబాబు, ఎన్.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కుల సాధన



సామర్లకోట బాప్టిస్టు ఫీల్డ్ కౌన్సిల్ సభ్యులు

సామర్లకోట: క్రైస్తవుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండాలని సీనియర్ పాస్టర్, క్రైస్తవ సువార్త ప్రసంగీకులు డాక్టర్ ఈలి సువార్తరాజు అన్నారు. స్థానిక బ్రౌన్‌పేటలోని సత్య సువార్త బాప్టిస్టు సంఘంలో ఏర్పాటు చేసిన సామర్లకోట బాప్టిస్టు ఫీల్డ్ కౌన్సిల్‌ను సోమవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐక్యంగా ఉండటం వలన ఏ కార్యమైనా సులభంగా సాధించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని 16 సంఘాల పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

పెద్దాపురం: తూర్పుపాకల గ్రామంలో కోడిపందేలపై సోమవారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు పందెం కోళ్లు, రూ.1,120 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై మౌనిక తెలిపారు.

ఆకట్టుకున్న ఖవ్వాలి



పొన్నాడలో గంధాన్ని తీసుకునేందుకు పోటీ పడుతున్న భక్తులు

కొత్తపల్లి: మత సామరస్యానికి చిహ్నంగా నిలిచిన బషీర్‌బీబీ (బంగారు పాపమ్మ) ఔలియా ఉర్స్ పొన్నాడలో ఆదివారం రాత్రితో ముగిశాయి. చివరి రోజున ఏర్పాటు చేసిన గోవాకు చెందిన రేడియో, టీవీ సింగర్ చాంద్ అతీస్, బెల్గాంకి చెందిన రేడియో, టీవీ సింగర్ సాదిగ సంజరి మధ్య జరిగిన ఖవ్వాలి కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. సుమారు 50 వేల మంది భక్తులు హాజరైనట్టు ముజావర్లు తెలిపారు. అర్ధరాత్రైనా గంధాన్ని తీసుకునేందుకు భక్తులు పోటీ పడడం కనిపించింది.

సేంద్రియ సాగుపై శిక్షణ



ఏటీఎం మోడల్ తయారీ విధానాన్ని వివరిస్తున్న అధికారులు

పిఠాపురం: ఎన్‌పీఎం షాప్ యాజమానులకు రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం సోమవారం గొల్లప్రోలు మండలం దుర్గాడలో నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో కొత్త వ్యవసాయ పద్ధతులపై అధికారులు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా నాలుగో రోజు రైతు కుల వీరభద్రరావు ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ఏటీఎం మోడల్ పరిశీలించారు. డీపీఎం ఎలియాజరు మాట్లాడుతూ, 20 సెంట్ల భూమిలో ఏటీఎం మోడల్ వేయడం వల్ల నిరంతరం ఆదాయాన్ని పొందవచ్చన్నారు. 4 వేల కేజీల ఘన జీవామృతం, బయోచార్‌ల తయారీ విధానాన్ని వివరించారు. స్టేట్ కన్సల్టెన్సీ జానకి, బుజ్జిబాబు, రిసోర్స్‌పర్సన్ గోపాలకృష్ణ, గుండ్ర శివచక్రం, గణేష్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: ఇద్దరిపై దాడి చేసిన కేసులో నిందితుడికి ఏడాది జైలు, రూ.2 వేల జరిమానా విధిస్తూ కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.లీలా శ్యామ్‌సుందరి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, పెదపూడి మండలం సంపర గ్రామానికి చెందిన కేత నాగబాబు 2023లో అదే ప్రాంతానికి చెందిన వాసంశెట్టి రాంబాబు, వాసంశెట్టి లక్ష్మిపై దాడి చేశాడు. పెదపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.